ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023
8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి



స్మార్ట్ అంతా అప్పే!

- రూ.1000 కోట్లలో అసలు రూ.200కోట్లే
- జివిఎంసిలో 40 స్కూళ్లకు రూ.60కోట్లు!
- అండర్ గ్రౌండ్, నీటి కనెక్షన్లకు రూ.543కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యాన జరిగే ప్రధాన ప్రాజెక్టుల్లో స్మార్ట్ సిటీ మిషన్ ఒకటి. విశాఖ నగరంలో ఈ ప్రాజెక్టు నడక సంగతి ఎలాగున్నా ప్రభుత్వం నుంచి నిధుల విదిలింపు నానాటికీ అధ్వానం. మొత్తం రూ.1000కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.800 కోట్లు పూర్తిగా రుణం తీసుకున్నట్లు స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పర్యవేక్షకులు, జివిఎంసి చీఫ్ ఇంజినీరు రవి కృష్ణరాజు ఇటీవలే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు గొట్టేటి మాధవి అధ్యక్షతన జరిగిన దిశ సమావేశంలో వెల్లడించారు. ఇంత అప్పు జివిఎంసిపై ఉందా? అన్న రీతిలో ఆ సందర్భంగా అరకు ఎంపీ బిక్కమొఖం వేశారు. నగర జీవులపై ఈ అప్పుల భారం వేర్వేరు రూపాల్లో కుప్పలు కుప్పలుగా పడుతుందనడానికి ఈ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు వ్యయమే తార్కాణంగా నిలుస్తోంది.

ఎక్కడ? ఎలా అమలు చేశారు?

తొలి దశ ఈ ప్రాజెక్టులో జోన్ 3లో మొత్తం వైశాల్యం 1600 ఎకరాలను గుర్తించారు. 61 ప్రాజెక్టులకు గానూ 55 పూర్తయ్యాయి. వీటికి రూ.543కోట్లు జివిఎంసి ఖర్చు చేసింది. దీంట్లో 4 ప్రాజెక్టులు గాజువాక, మల్కాపురం తదితర చోట్ల పెండింగులో ఉన్నాయి. జివిఎంసి 40 స్కూళ్లకు రూ.60కోట్లు ఖర్చు చేశారు. ఒక్కొక్కటకి రూ.1.5కోట్లను వెచ్చించారు. ఫర్నిచర్, రంగులు వేయడం, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం మొత్తంగా ఖర్చుచేశారు. స్మార్ట్ సిటీలో రూ.70 కోట్లతో జోన్ -3లో కేంద్ర ప్రభుత్వ పథకం అమృత ఫేజ్ -1లో 30,588 కుళాయి కనెక్షన్లు, ఫేజ్ -2లో 7వేలు కనెక్షన్లు పూర్తయ్యాయి. ఇటీవలే అమృత్ పథకంలో భాగంగా రూ.344.62 కోట్లతో 26 కొత్త పనులు ప్రారంభించి 22 పనులకు టెండర్లు పిలిచారు. దీంట్లో 6 పిపిపికి జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఇచ్చింది. మొత్తంగా ఒకే ప్రాంతం సాగరతీరానికి అభిముఖంగా ఉండే ఆర్‌కెబీచ్ తదితర చోట్ల రోడ్లకు, రంగులకు రూ.కోట్లు ఈ స్మార్ట్ ప్రాజెక్టులో ఖర్చుచేసి ఈ రుణభారాన్ని నగర ప్రజలపై అధికం చేశారన్న సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఇతర ప్రతిపక్షాల వాదనలు నిజం చేసేలాగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్కపైసాను పాలకులు రప్పించలేక పోతున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంఎయుడి)పై నిధుల ఒత్తిడికి జివిఎంసి చేస్తున్న ప్రయత్నాలు దాదాపు శూన్యం.

విశాఖపట్నం స్మార్ట్ సిటీ అభివృద్ధికి రూ.3వేల కోట్లు ఖర్చుచేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మిగతా 2లో..

3,4 తేదీల్లో వర్షాలు

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం - తుపానుగా బలపడే అవకాశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని దక్షిణ అండమాన్ ప్రాంతాల మీద ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర అల్పపీడన ప్రాంతం వాయువ్య దిశగా కదులుతూ రాగల 24 గంటల్లో ఈ నెల 1 నాటికి వాయుగుండంగా మారనుంది. తర్వాత ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 3వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతం మీద తుపానుగా మారనుండడంతో ఉత్తరాంధ్ర, విశాఖ జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 4వ తేదీకి తుపానుగా దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. దక్షిణ ఆంధ్రాలో పలుచోట్ల భారీ వర్షాలు కురియనుండగా ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురియనున్నాయి. విశాఖ నగరంలో 3, 4 తేదీల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గాలుల తీవ్రత కూడా అధికంగా ఉండనుంది. ఎపి, యానాం అన్నిచోట్లా గాలులు వీయనున్నాయి. ఈ తుపాను హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అవుతోంది. మత్స్యకారులను చేపట వేట కోసం సముద్రంలోకి వెళ్లకుండా ఆ రెండు రోజులు నియంత్రించే చర్యల దిశగా అడుగులు వేస్తున్నారు.



కొత్త జాలారిపేటలో దగ్ధమవుతున్న బల్డీలు, వలలు

కొత్త జాలారిపేటలో అగ్నిప్రమాదం
9 బల్డీలు, వలలు దగ్ధం

వార్త మెయిన్‌లో..

రేపటి నుంచి లెజెండ్స్ క్రికెట్ టోర్నమెంట్
▶ వార్త మెయిన్‌లో..

ఎంజిఆర్ చెన్నై సెంట్రల్- భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు
▶ వార్త 2లో..

తీరంలో కొనసాగుతున్న నేవీ విన్యాసాలు
▶ వార్త 8లో..

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం
▶ వార్త 3లో..

ఓటర్ల జాబితాపై సమీక్ష

- తప్పులు లేకుండా రూపొందించాలి
- నిరాశ్రయులు, ట్రాన్స్ జెండర్లకు అవకాశం కల్పించాలి
- జిల్లా కలెక్టర్ మల్లికార్జున



ప్రజాశక్తి-విశాఖపట్నం : తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఓటరు జాబితా కీలకమని పేర్కొన్నారు. జిల్లాలో అందరు ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒలతో ఓటరు జాబితా రూపకల్పన, చేరికలు, తొలగింపు, ఎన్నికల జాబితా స్వచ్ఛికరణ, యువ ఓటర్ల నమోదు, జెండర్ రేషియో, ఈపి రేషియో, ట్రాన్సజెండర్స్, నిరాశ్రయులను ఓటర్లుగా నమోదు, ఎన్నికల ఫిర్యాదులు తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చనిపోయిన వారి దరఖాస్తులకు సంబంధించి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. ఓటరు జాబితాకు సంబంధించిన అన్ని రికార్డులను తప్పక నిర్వహించాలన్నారు. జిల్లాలో అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. నిరాశ్రయులు, ట్రాన్సజెండర్లను ఓటర్లుగా నమోదు చేయుటకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని ఆదేశించారు.

ఒకే డోర్ నెంబరులో 10 ఓట్ల కంటే ఎక్కువ ఉంటే

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'స్మార్ట్' అంతా అప్పే!

గతంలో విశాఖలో ప్రకటించారు. వాస్తవానికి రూ.1000కోట్ల స్మార్ట్ ప్రాజెక్టులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిపి రూ.200కోట్లకు మించి ఒక్కపైసా ఇవ్వకపోవడం ఒక ఎత్తు కాగా రూ.3వేల కోట్లతో స్మార్ట్ ప్రాజెక్టులకు ఇస్తామనడం ఉట్టికెగనమ్మ స్వర్గానికేగిందన్న సామెత గుర్తుకొచ్చేలా కిషన్‌రెడ్డి హామీ ఉంది. విశాఖలో రూ.120కోట్లతో స్మార్ట్ రోడ్ల ప్రాజెక్టు పాదాచారుల కోసం ప్రత్యేక లేన్‌లతో చర్యలు తీసుకుంటున్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

నిశితంగా పరిశీలించాలని సూచించారు. సవరణలో భాగంగా ఫారం-8 ద్వారా వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ చేయాలన్నారు. ఓటరు జాబితాలో డోర్ నెంబర్ లేకపోవడం, మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, ఫోటోలు కనపించకపోవడం, డబుల్ ఎంట్రీలు, దొంగ ఓట్లుపై దృష్టి సారించి ఖచ్చితమైన ఓటరు సర్వే చేపట్టాలన్నారు. ప్రత్యేక క్యాంపులు పెట్టి ఎక్కువ మంది యువ ఓటర్లకు అవకాశం కల్పించాలని, కళాశాల్లో చదివే విద్యార్థుల వివరాలను సేకరించి వారందరికీ ఓట్లు ఉన్నాయో లేదో పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధి డాబాగార్డెన్స్‌లో ఉన్న ప్రేమ సమాజం ఆవరణలో కొత్తగా ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటైంది. ఈ ప్లాంట్‌ను ప్రేమ సమాజం అధ్యక్షులు బుద్ద శివాజీ గురువారం ప్రారంభించారు. ప్రేమ సమాజానికి చెందిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 450మంది విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గంగవరం పోర్టు సిఇఒ బి.జి.గాంధీ చొరవతో 100 లీటర్ల సామర్థ్యమున్న ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసినట్లు శివాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం కార్యదర్శి హరి మోహనరావు, ఉపాధ్యక్షుడు కె.నరసింహమూర్తి, కోశాధికారి ఎంవివికె గుప్తా, మాజీ కార్యదర్శి కొన జగదీశ్వరరావు, సంయుక్త కార్యదర్శి గౌరీ ప్రసాదరావు, హెడ్మాస్టర్ కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలే లక్ష్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యువతకు శిక్షణతో పాటు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించడం 'లీడింగ్ టువార్డ్స్ నెక్స్ట్ ఏజ్ ప్రోగ్రామ్స్' లక్ష్యమని స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ కార్యక్రమాలను ప్లాన్ చేస్తోందన్నారు. భారతీయ కార్మిక మార్కెట్లో నైపుణ్యాల కొరతను పరిష్కరించడం దీని ఉద్దేశమన్నారు. పరిశ్రమల డిమాండ్, శ్రామికశక్తి నైపుణ్యాల మధ్య అంతరాన్ని పూడ్చడం ముఖ్యమని చెప్పారు. అవకాశాలను విస్తృతం చేయడంలో ఉన్నత విద్య కీలకమైన ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందన్నారు.

ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 06073 డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ స్పెషల్ డిసెంబర్ 4 నుంచి జనవరి 29వ తేదీ వరకు ప్రతి సోమవారం రాత్రి 23.45 గంటలకు ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11:15 గంటలకు దువ్వాడ, సాయంత్రం 18.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. 06074 భువనేశ్వర్ - డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ స్పెషల్ భువనేశ్వర్ డిసెంబర్ 5 నుంచి జనవరి 30వ తేదీ వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 21.00 గంటలకు భువనేశ్వర్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారు జామున 3:45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 15.00 గంటలకు డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్లు గూడూరు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం, పలాస, ఖుర్దా రోడ్డు మీదుగా ప్రయాణిస్తాయి.

సంబల్పూర్ - ఈరోడ్ సేవల పొడిగింపు

08311 సంబల్‌పూర్-ఈరోడ్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 6 నుంచి 2024 ఫిబ్రవరి 28 వరకు ప్రతి బుధవారమూ ఉదయం 10:55 గంటలకు సంబల్పూర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 20:45 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు 19.50 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. 08312 ఈరోడ్ - సంబల్‌పూర్ వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 8 నుంచి 2024 మార్చి 1వ తేదీ వరకు ప్రతి శుక్రవారమూ మధ్యాహ్నం 13:45 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12:08 గంటలకు దువ్వాడ, అదేరోజు రాత్రి 21:15 గంటలకు సంబల్పూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు బార్‌గఢ్ రోడ్, బలంగీర్, టిట్లాఘఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం జంక్షన్, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, పెరంబూర్ కాట్పాడి, జోలార్‌పేట, సేలం మీదుగా ప్రయాణిస్తాయి.

మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, ఎమ్‌డి బేగం పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 972వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో మహిళా సమాఖ్య కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోరాటాల ద్వారానే స్టీల్‌ప్లాంట్ కాపాడుకుందామన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నరేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రయివేటీకరణ విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనేక ఇబ్బందులు సృష్టించి, కర్మాగారాన్ని నష్టాల సాకుతో అమ్మేయడానికి కుట్ర పన్నుతోందని, దాన్ని అమ్మే హక్కు మోడీకి లేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షల్లో సమాఖ్య విశాఖ జిల్లా నాయకులు ఎ.దేముడమ్మ, ఎస్‌కె మస్తాన్‌బీ, కె.పద్మ, పుష్పలత, అరుణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగరాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు కందుల నాగరాజు జన్మదిన వేడుకలను అల్లిపురంలోని ఆయన గృహంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వందలాది మంది మహిళలకు వస్త్ర దానం, ప్రజలకు అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, తాను స్థాపించిన కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత కొన్నాళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. పేద మహిళలకు బంగారు తాళి బొట్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, పేదలకు తోపుడు బండ్లు, పేద మహిళలకు కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు తదితరాలు అందించామని తెలిపారు. తన శక్తి మేరకు విశాఖ దక్షిణ నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పిఎసి సభ్యుడు కోన తాతారావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, నాయకులు పి.శివప్రసాద్‌రెడ్డి, జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, తెలుగుశక్తి అధ్యక్షుడు బివి,రామ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొని నాగరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న కందుల నాగరాజు

సీతారామస్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చెంగలరావుపేటలోని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయం ట్రస్టు బోర్డును నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా కోసూరు వాసు, వల్లి శ్రీనివాసరావు, కాకి పద్మ, సనపల రోహిణి, ఎస్.శీలా దేవి, తోటాడ లక్ష్మి, పి.రామకృష్ణ (అర్చక ఎక్స్ అఫీషియో) నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఈ పాలకవర్గం ఉంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సిఫార్సు మేరకు ట్రస్టు బోర్డును నియమించినట్లు బోర్డు సభ్యులు సనపల రోహిణి మీడియాకు తెలిపారు.

3న చెస్‌పై అవగాహన

ప్రజాశక్తి-విశాఖపట్నం : శ్రీచెస్ అకాడమీ ఆధ్వర్యాన ఈనెల 3వ తేదీన మాధవధారలో రాంసాయి హోటల్ వద్ద ఉచిత చెస్ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఆసక్తి గల వారు 9989971232, 9849371760 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేవీ డేకు పరిశుభ్రత పనులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆర్‌కె.బీచ్‌లో ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్న నేవీ డే ఉత్సవాల ఏర్పాట్లలో అవసరమైన విద్యుత్ దీపాలు, పరిశుభ్రత పనులను చేపట్టాలని అధికారులకు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. నేవీ డే ఏర్పాట్లను నేవీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 54వ వార్డు జ్యోతినగర్, లక్ష్మీనగర్, మహారాణి వీధి, సూర్య నగర్‌లో రూ.2.14కోట్లతో బిటి రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి,ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. గురువారం జ్యోతినగర్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని వార్డుల్లోనూ సమ ప్రాతిపదికన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ఎస్ఇ వేణుగోపాల్, ఇఇ మత్స్యరాజు, డిఇఇ భరణి, ఎఇఇ రత్నాకర్, మండల ఇన్‌చార్జిలు జివి.రమణి, కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి, వార్డు నాయకులు చిరంజీవి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, అచ్యుతరావు, ప్రసాద్, వెంకటేష్, రాంబాబు, శ్రీను, శంకర్, నాగరాజు, మారన్న, మోహన్, రమేష్, దంతేశ్వరరావు, హరనాథ్‌రెడ్డి, జగదీశ్, దిలీప్ పాల్గొన్నారు.

12న దీపోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం :ఈ నెల 12న పద్మనాభం కొండపై నిర్వహించనున్న అనంత పద్మనాభుని దీపోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ ఇఒ నానాజీబాబు కోరారు. గురువారం కుంతీమాధవస్వామి అలయం కల్యాణ మండపంలో మాట్లాడుతూ, ప్రతి ఏటాలాగానే ఈ ఏడాది కూడా దీపోత్సవానికి నేతలు, అధికారులు, ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కె రాంబాబు, ఎంపిడిఒ ఎం విజయకుమార్.పాల్గొన్నారు.

నిర్ధేశిత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలి



బైక్‌లకు వీల్ లాక్ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -మధురవాడ : వాహనాలను నిర్ధేశిత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని నార్త్‌జోన్ ఎసిపి జాన్ మనోహర్ సూచించారు. గురువారం నార్త్ జోన్ పరిధిలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలు, వాహనదారులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఎండాడ కూడలి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్ లాక్ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐ వెంకటరావు, ఎస్ఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ఒడిశా మంత్రి ఉషాదేవి

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఒడిశా మంత్రి ఉషాదేవి గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు సిరిపురం కనకరాజు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు.

లేగదూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శన తిలకిస్తున్న వెంకటప్పడు

ప్రజాశక్తి-పద్మనాభం: లేగదూడలను శాస్త్రీయ పద్ధతిలో పెంచాలని డిఎల్‌డిఎ చైర్మన్ గాడు వెంకటప్పడు సూచించారు. గురవారం మండలంలోని వెంకటాపురంలో వెటర్నరీ ఏడీ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శనను ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి 70 లేగదూడలు ప్రదర్శనకు రాగా, వాటిలో ఆరోగ్యవంతమైన మూడు దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.కొవ్వాడ పశువైద్యాధికారి సంధ్య, సిబ్బంది సురాల దేశాయి, సర్పంచ్ కర్రి రమణ, ఎంపిటిసి ఎస్.సూర్పడు, కె రమణ పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం

కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ముత్తంశెట్టి



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఆనందపురం : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం బోనిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.భీమిలి నియోజకవర్గంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా ఏడు వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.. బోని, శిర్లపాలెం గ్రామాల్లోని ఇనాం భూములపై రైతులకు సర్వహక్కులు కల్పించి, త్వరలోనే పట్టాలు అందజేస్తామన్నారు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, సర్పంచ్ బోని అప్పలకొండ, భీమిలి ఎడిఎ బి.విజయ్‌ప్రసాద్, ఎఒలు తహసీల్దార్ లోకవరపు రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, ఆనందపురం పిఎసిఎస్ అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, బంక సత్యం, అన్నమయ్య, వ్యవసా యాధికారులు సంధ్యారత్న ప్రభ, శివ కోమలి, చలం, బోని సన్యాసినాయుడు, రౌతు వెంకటరావు, రౌతు శ్రీను పాల్గొన్నారు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. చిన్నాపురంలో ఎనిమిది గ్రామాలకు చెందిన 105 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మజ్జిపేట విద్యార్థులు



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన బాలికలు వీరే

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈనెల 9,10,11 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూడో ఛాంపియన్ షిప్ పోటీలకు మండలంలోని మజ్జిపేట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు జూడో క్రీడా సంఘం జిల్లా అధ్యక్షులు రుక్మాకరరావు తెలిపారు. బాలికల విభాగంలో... ఎస్ మేఘన, పి రేష్మ, బి హాసిని, కె ఝాన్సీ, సిహెచ్ శృతి, అలేఖ్య, ఎం సంజన, పి జయశ్రీ, బి శృతి, వై చంద్రకళ,ఎం పూర్ణిమ, డి.చాందిని, బాలుర విభాగంలో ఎన్ షణ్ముఖరావు, మజ్జి రామ్‌చరణ్, ఎర్రాజి నిఖిల్, జి భాస్కరరావు, చిన్ని దిలీప్, అల్లు లోకేష్, మజ్జి హేమవరుణ్, మజ్జి విశాల్, నమ్మి రాకేష్, కోరాడ లిఖిత్ , నీలాపు శ్రీను ఎంపికయ్యారన్నారు.గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం పి ఉషారాణి, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, టీమ్ కోచ్ ఎం రజని అభినందించారు.


ప్రజోపకర సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ప్రజాశక్తి -గాజువాక: సేవా సంస్థలు ప్రజోపయోగ పనులు చేపట్టాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సూచించారు. గురువారం 70వ వార్డు సీతారామ ప్రమీల కల్యాణ మండపంలో మానవతా స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థ, గాజువాక యూనిట్ చైర్మన్ దేనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాకలోని సంస్థ కార్యాలయానికి మంచినీటి బోరు వేయిస్తానని హామీనిచ్చారు. ఎన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 2004లో 108 సభ్యులతో ప్రారంభమైన సంస్థ నేడు 19 జిల్లాల్లో విస్తరించిందన్నారు. ఎసిపి టి త్రినాథ్ మాట్లాడుతూ గాజువాక ప్రాంతాల్లో సంస్థ అందిస్తున్న వైద్య,సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం వికలాంగులకు ట్రైసైకిల్స్, పేదలకు నిత్యావసరాలు, బట్టలు పంపిణీ చేశారు. ఎయు మాజీ రిజిస్ట్రార్ వి కృష్ణమోహన్, సంస్థ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, డాక్టర్ కె పుణ్యవతి, ఎడిసి చైర్మన్ చైర్మన్న బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం :డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : హెచ్ఐవి, ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా అందరం పోరాడుదామని డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న శుక్రవారం 35వ ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో విలేకర్లుతో మాట్లాడుతూ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ గణాంకాల ఆధారంగా 2016-17తో పోల్చుకుంటే జిల్లాలో 0.01శాతం ఎయిడ్స్ తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రధానంగా వివాహేతర సంబందాలు, అసురక్షితమైన లైంగిక సంబంధాల వల్ల జిల్లాలో 15-49ఏళ్ల వయస్సున్న వారు 90శాతం మంది ఎయిడ్స్‌తో బాధపడుతున్నారన్నారు. గర్భిణీ స్త్రీలు %ఎక్కువ% పరీక్షలు చేయించుకున్నవారు 45,802మంది గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు చేయగా, వారిలో 31 మంది పాజిటివ్‌తో ప్రసవాలు జరిగాయన్నారు. 36 మంది హెచ్ఐవి, టిబితో బాధపడుతుండగా, 366 మంది పిల్లల్లో హెచ్ఐవి ఎఆర్‌టి మందులు వాడుతున్నారన్నారు. డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ, హెచ్ఐవిలో రాష్ట్రంలో ఆరోస్థానంలో జిల్లా ఉందన్నారు. ఈ సందర్భంగా లూపిన్ ఫార్మా కంపెనీ సమకూర్చిన రూ. లక్ష ఖరీదు చేసే మందులు అందచేసారు. డిఎల్‌టిఒ బి.నాగేశ్వరరావు, డెమో, శైలజ డిపిఎం సయ్యద్ బేగం, బద్రి, నాగభూషణంపాల్గొన్నారు.

ఎట్టకేలకు అందుబాటులోకి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ



పెదగదిలి కూడలి వద్ద అందుబాటులోకి వచ్చిన సిగ్నల్ వ్యవస్థ

ప్రజాశక్తి - ఆరిలోవ :బిఆర్‌టిఎస్ రోడ్డు పెదగదిలి కూడలిలో ఎట్టకేలకు ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దీంతో కొంతవరకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయని వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హనుమంతువాక నుంచి అడివివరం వరకు నాలుగు వరుసల బిఆర్‌టిఎస్ రహదారిని నిర్మించి ఏళ్లుగడిచినా, రెండేళ్ళ క్రితమే ప్రధాన కూడళ్ళలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ . ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో వేగం నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పెదగదిలి కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ప్రారంభించారు. చినగదిలి, దీనదయాల్‌పురం కూడళ్ళలో కూడా సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

నాటుసారాతో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ముకుందరాజుపేట గంగరాజు చెరువు వద్ద నాటుసారా విక్రయ కేంద్రాలపై గురువారం సాయంత్రం దాడులు నిర్వహించి, ఇద్దరు వ్యక్తుల నుంచి చెరో నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత పరిసర ప్రాంతంలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్ట చేసినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు.నిందితుల నుంచి రూ.మూడు వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడిలోవ పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ గరిబ్ కల్యాణ్ అన్న యోజన, పిఎం అవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, అయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, జల్‌జీవన్ మిషన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, జన్‌ధన్ యోజన, పిఎం స్వనిధి, నారీశక్తి వందన్ అధినియమ్, ఎన్ఇపి, స్కిల్ ఇండియా మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ వంటి పథకాలపై అవగాహన కల్పించారు. పలువురు కేంద్ర పథకాల లబ్ధిదారులను సత్కరించారు కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు, ఎంపిటిసి వాసుపల్లి శ్రీహరి, కంటుభుక్త రామానాయుడు, ప్రసాదరావు పట్నాయక్, బండారు అనిల్‌కుమార్, మీసాల రామునాయుడు, గండ్రెడ్డి వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -పిఎం పాలెం: ఎపిఇపిడిసిఎల్ మూడోజోన్ ఆపరేషన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 11కెవి పెప్సీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 1న, శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పిఎం.పాలెం సబ్ స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు తెలిపారు. 45వ సచివాలయం పరిధిలోని బాబా నగర్, విజేత సూపర్ మార్కెట్, కారుషెడ్ ఏరియా తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించగలరని కోరారు.

పుస్తక పఠనంతో మనో విజ్ఞానం



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ధనరాజు

ప్రజాశక్తి -గాజువాక. : మనిషి జీవితంలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని ఎయు లైబ్రేరియన్ డాక్టర్ ధనరాజు అన్నారు. గురవారం గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బి రామారావు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానంతో పాటు మనోవికాసం కలుగుతుందన్నారు. కాలేజీ లైబ్రేరియన్ నారాయణమ్మ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-ఆనందపురం : స్థానిక శివాలయంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం గురువారం సర్పంచ్ చందక లక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.రమణమ్మ, నాయకులు షినగం రామారావు, చిన్న రామారావు, చందక అప్పలస్వామి, చందక శంకరరావు, ఎంపిటిసి కొట్టాడ రమాదేవి, మీసాల నాయుడు, కొట్టాడ సత్యమూర్తి, ,ధనియాల సాయి, ఆలయ పూజారులు రాంబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

'ఉత్తర'లో 40వేల దొంగ ఓట్లు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 40 వేలకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయని బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. గురువారం సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 175 కి 175 సీట్లు గెలిస్తామని ఎలా ధీమాగా చెబుతున్నారో ఇపుడు అర్థమౌతోందన్నారు ఒక్క ఉత్తర నియోజకవర్గంలోనే 40వేలు పైచిలుకు దొంగ ఓట్లు ఉంటే, మిగతా నియోజకవర్గాల్లో ఇంకెన్ని ఉన్నాయో తేలాల్సి ఉందన్నారు. ఒకే ఇంట్లో 67ఓట్లు ఉండడం ఆశ్చర్యకరమన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

265 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక: ఆదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో 75వ వార్డు నెల్లిముక్క కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. వైద్యశిబిరంలో 265 మందికి కంటి పరీక్షలు చేయగా,. 127 మందికి కంటిఅద్దాలు, 16మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మెరుగైన వైద్యం అవసరమైన 33మందికి పోర్టు సొంతఖర్చులతో వైద్యం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ములకలపల్లి పెంటయ్య, ముసిరి శ్రీనివాసరావు, పెద్దాడ సోమునాయుడు మొల్లి అప్పారావు, ఉరుకుటి వెంకటరావు, దొమ్మేటి పెరుమాళ్, దొమ్మేటి సోమునాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు అబీషా కళ



కోచ్‌తో అబీషా కళ

ప్రజాశక్తి -మధురవాడ : ఈనెల 12 నుంచి 15 వరకు ఛండీగఢ్‌లో జరగనన్న 61వ జాతీయ స్కేటింగ్ పోటీలకు తిరుమల రోలర్ స్పోర్ట్స్ అసోషియేషన్‌కు చెందిన అబీషాకళ ఎంపికైనట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, చీఫ్ కోచ్ కరణం గంగాధర్ తెలిపారు. ఇటీవల విశాఖపట్నం లో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో అబీషాకళ మంచి ప్రతిభ కనపరచిందన్నారు. మధురవాడ ఎస్ఎఫ్ఎస్.పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అబీషాకళ, స్కూల్ గేమ్స్ స్టేట్ లెవెల్ పోటీల్లోనూ సత్తా చాటిందన్నారు. జాతీయ స్కేటింగ్ పోటీల్లో అబీషాకళ ఉత్తమంగా రాణించి పతకంతో రావాలని తల్లిదండ్రులతోపాటు పలువురు ఆకాంక్షించారు.

24న కాపుల వనసమారాధన



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాపుసంఘం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక శ్రీకష్ణదేవరాయ కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో, ఈనెల 24న అప్పికొండ బీచ్‌లో కాపుల వనమహోత్సవం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిల వాల్‌పోస్టర్‌ను గురువారం చినగంట్యాడలో ఆవిష్కరించార. కార్యక్రమంలో కార్పొరేటర్స్ గుడివాడ శిరీష, రాజాన రామారావు, సంఘం అధ్యక్షులు జెర్రిపోతుల ముత్యాలు, గుడివాడ లతీఫ్, ప్రధాన కార్యదర్శి తలారి వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ణం బాబురావు, గంతకోరి అప్పారావు, గొల్లవిల్లి నూకరాజు, రాము, గిరిబాబు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం!

- రామచంద్రనగర్ డంపింగ్ యార్డ్‌తో 16 గ్రామాల జనం అవస్థలు
- స్టాక్ పాయింట్ నుంచి చెత్తయార్డుగా మార్పు
- ఐదేళ్లవుతున్నా అమలు కాని సిఎం జగన్ హామీ
- నేడు మహాధర్నాకు సిద్ధమౌతున్న బాధితులు

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 76వ వార్డు రామచంద్రనగర్‌కు ఆనుకుని ఉన్న డంపింగ్‌యార్డ్ 16 గ్రామాల ప్రజలను నానా అవస్థలకు గురిచేస్తోంది.రెండు జిల్లాల నుంచి తీసుకొచ్చి మురగబెడుతున్న చెత్త నుంచి వెదజల్లుతున్న దుర్గంధం, కాలుష్యంతో జనం తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు.గడచిన ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే ఆరునెలల్లోనే డంపింగ్ యార్డులను తరలిస్తానని సిఎం జగన్ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. సొంతిళ్లు ఉన్నా, నివాసముండలేని దుర్భర పరిస్థితుల నుంచి విముక్తి కల్పించాలని పరిసం గ్రామాల ప్రజలు శుక్రవారం ధర్నాకు సిద్ధమౌతున్నారు. 2012లో చిన్న స్టాక్‌యార్డుగా ఏర్పాటు చేసి, ఈ ప్రాంతంలోని చెత్తను ఏరోజుకారోజు తీసుకొచ్చి కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. దీంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. తర్వాత గత ప్రభుత్వం ఇక్కడే డంపింగ్ యార్డ్‌ను నిర్మించింది.. మొదట్లో ఒక్క గాజువాక నియోజకవర్గ పరిధిలోని చెత్తనే తీసుకొచ్చి స్టాక్ చేసేవారు. కాలక్రమేణా ఇపుడు విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి చెత్తను ఇక్కడే తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు.రోజూ సగటున 250టన్నుల చెత్త ఇక్కడకు చేరడం, రెండు మూడు నెలలపాటు దాన్ని కుళ్లబెట్టి సేంద్రీయ ఎరువులను తయారు చేసే ప్రక్రియను జివిఎంసి ప్రస్తుతం నిర్వహిస్తుండడం పరిసర ప్రాంతీయుల పాలిట గుదిబండలా మారింది. జివిఎంసి నిర్వహిస్తున్న ఈ డంపింగ్ యార్డ్‌తో రామచంద్ర నగర్, రిక్షాకాలనీ, స్వతంత్రనగర్, ఎస్‌టి కాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, గాంధీనగర్, గోపాల్‌రెడ్డినగర్, భరత్ నగర్, నడుపూరు, సీరవాణి పాలెం తదితర 16 గ్రామాల ప్రజలు దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి. మరోవైపు శ్వాసకోశ వ్యాధులు గుండె జబ్బులు, మెదడువాపు వ్యాధులు, చర్మవ్యాధులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



దుర్గంధం వెదజల్లుతున్న రామచంద్రనగర్ దరి డంపింగ్ యార్డు

నేటి ధర్నాకు తరలిరండి



రామచంద్రనగర్ డంపింగ్‌యార్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సిఎం జగన్‌తోపాటు ఇతర నేతలు అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంపై డిసెంబర్ ఒకటిన శుక్రవారం డంపింగ్ యార్డు గేటు వద్ద 16 గ్రామాల బాధిత ప్రజలు నిర్వహించే మహాధర్నాకు తరలిరావాలి. ధర్నా విజయవంతంతో పాలకులు, అధికారుల కళ్లు తెరిపిస్తాం.

డి.రమణ, డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ సభ్యులు

అమలు కాని సిఎం హామీ

తాము అధికారంలోకి వస్తే ఆరునెలల్లోనే రామచంద్రనగర్ డంపింగ్ యార్డును తరలిస్తామని ఐదేళ్ల క్రితం ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గాజువాక వంటిల్లు జంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో హామీఇచ్చారు. అయితే నేటికీ దాన్ని అమలు చేయకపోగా, అప్పట్లో ఒక్క గాజువాక నియోజకవర్గం చెత్తను మాత్రమే తెచ్చిన యంత్రాంగం, ఇపుడు అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి చెత్తనంతా ఇక్కడకే చేరవేసి మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో డంపింగ్ యార్డు తరలింపును ప్రధానాంశంగా ఎవరు హామీఇచ్చి అమలు చేస్తామని నమ్మకం కలిగిస్తారో ఆ పార్టీకే గాజువాక నియోజకవర్గంలో బాధిత ప్రజలంతా అండగా ఉండి గెలిపిస్తామని స్పష్టం చేస్తున్నారు.

దుర్భరంగా జీవనం



డంపింగ్ యార్డ్‌తో తీవ్ర అనారోగ్యం పాలౌతున్నాం. సాయంత్రం ఆరు గంటలు దాటితే ఇళ్లల్లోంచి బయటికి రాలేని పరిస్థితి. కడుదుర్భరంగా బతుకు వెల్లదీస్తున్నాం. డంపింగ్ యార్డు తరలించి, ఆదుకోవాలి. న్యాయం చేయాలి.

బి.రామారావు, బాధితుడు, రామచంద్రనగర్

ప్రజల ఆందోళనలు, నిరసనలు బలాదూర్

జనావాసాల మధ్య డంపింగ్ యార్డు ఉండకూడదన్న నిబంధనలకు విరుద్ధంగా జివిఎంసి దీన్ని ఏర్పాటుచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు అంటున్నారు.దీనిపై ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నా కనీసం స్పందించే దిక్కు లేదని వాపోతున్నారు. రోజూ సగటున తీసుకొచ్చిన 250టన్నును చెత్తను మూడునెలల పాటు అలాగే ఉంచితే దాని నుంచి వెలువడిన దుర్వాసన ఎలా ఉంటుందో వేరే చెప్పక్కరలేదు. ఆదాయం కోసం పాకులాడుతూ, జివిఎంసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆవేదన చెందుతున్నారు.

సొంతిల్లు ఉన్నా ఫలితం లేదు.



సొంతిల్లు ఉన్నా గ్రామంలో జీవించలేకపోతున్నాం. దుర్వాసనను భరించలేక ఉన్న ఇంటిని వదిలేసి, వేరే ప్రాంతంలో అద్దెకు ఇల్లు తీసుకుని జీవించాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు స్పందించి, డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలి.

జి కమలాకరరావు మాస్టర్, రామచంద్రనగర్

బాలలతో పనిచేయిస్తే చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న సహాయ లేబర్ ఆఫీసర్‌విజయశ్రీ

ప్రజాశక్తి- వేపగుంట : 14ఏళ్లలోపు బాలబాలికలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయశ్రీ హెచ్చరించారు. గురువారం వేపగుంటలోని పలుప్రాంతాల్లో సంస్థలు, దుకాణాలు, పనిప్రదేశాల్లో బాలకార్మికులపై నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా చైల్డ్ లేబర్ రెస్క్యూ టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందాలుగా జిల్లాలో గత నెల 20 నుంచి డిసెంబర్ 5వరకు బృందాలుగా తనిఖీలు నిర్వహిస్తుందని, బాలలతో పనిచేయిస్తూ పట్టుబడితే రూ.20వేలు జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. 18ఏళ్లలోపు బాలలను ప్రమాదకరపరిస్థితుల్లో పనిచేయించినా శిక్షార్హులౌతారన్నారు. వీరికి రూ.20వేలు జరిమానాతోపాటు సెక్షన్ '3ఎ' ప్రకారం జైలుశిక్ష తప్పదన్నారు. తనిఖీల్లో భాగంగా సంస్థలు, దుకాణ యుజమానులు తప్పనిసరిగా కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిహెచ్.శ్రీనివాస్, పివిటి లోవకుమార్ పాల్గొన్నారు.

మహారాష్ట్ర టూరిజం ట్రావెల్ అండ్ ట్రేడ్ షోకు స్పందన



జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభిస్తున్న మధుమతి

ప్రజాశక్తి -మాధవధార : మహారాష్ట్ర టూరిజం ట్రావెల్ అండ్ ట్రేడ్ రోడ్‌షోకు విశేష స్పందన లభిస్తుందని పర్యాటక విభాగం డిప్యూటీ డైరెక్టర్ మధుమతి అన్నారు. దేశంలో ఎనిమిది నగరాల్లో రోడ్‌షోల ద్వారా ప్రయాణ, వాణిజ్య అవకాశాలను ప్రోత్సహించే మహారాష్ట్ర టూరిజం ట్రావెల్ అండ్ ట్రేడ్ రోడ్‌షోను గురువారం మారియట్ హోటల్‌లో జ్యోతిప్రజ్వళనతో ప్రారంభించారు. అంతర్ రాష్ట్ర ప్రయాణం, పర్యాటకాన్ని ప్రోత్సాహించే లక్ష్యంతో విశాఖపట్నంలో తాము నిర్వహించే రోడ్‌షోకు గొప్ప స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. మహారాష్ట్రలోని అష్టవినాయక్, జ్యోతిర్లింగాలు, పంఢర్‌పూర్, కొల్హాపూర్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో అపారమైన ట్రావెల్, టూరిజం ల్యాండ్‌స్కేప్‌ను తెలియజేయడానికి వన్‌స్టాప్ షాప్‌గా ఈ ట్రేడ్‌షో ఉంటుందన్నారు.

ఎపి మారిటైం బోర్డు చైర్మన్‌గా 'కాయల' మళ్లీ బాధ్యతల స్వీకరణ



కాయల వెంకటరెడ్డిని అభినందిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- సీతమ్మధార: మంగళగిరిలోని ఎపి మారిటైమ్ బోర్డ్ ప్రధాన కార్యాలయంలో బోర్డు చైర్మన్‌గా కాయల వెంకటరెడ్డి గురువారం రెండవసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మారిటైమ్ బోర్డ్ మచిలీపట్నం పోర్ట్ ఎండి, రామాయపట్నం పోర్ట్ ఎండి,మూల పేట పోర్ట్ ఎండీలు, చీఫ్ మేనేజర్‌లు, బ్రాంచ్ మేనేజర్‌లు, ఇడిలు, మారిటైమ్‌బోర్డ్ ఉద్యోగస్తులు పుష్పగుచ్ఛాలను అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్ స్కూలు పరీక్ష ఫీజు 31లోగా చెల్లింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : సార్వత్రికి విద్యాపీఠం ద్వారా 2024లో జరగనున్న పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును డిసెంబరు 31లోగా చెల్లించేందుకు గడువు ఇచ్చినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ తెలిపారు. పదోతరగతి విద్యార్థులకు ఒక్కొక్క సబ్జెక్టుకు రూ 100లు, ఇంటర్‌కు రూ 150లు, ఇంటర్ ప్రాక్టికల్స్ ఒక్కొక్క సబ్జెక్టుకు రూ 100లు చెల్లించాలని సూచించారు

గురజాడ అప్పారావుకు ఘన నివాళి



పరవాడలో నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు, విద్యార్థినులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

మహాకవి గురజాడ అప్పారావు 108వ వర్థంతి కార్యక్రమాలు ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ తదితర సంఘాల ఆధ్వర్యాన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరవాడ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం ఆధర్యంలో గురువారం పరవాడ జిల్లా పరిషత్ బాలిక హైస్కూల్లో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ గురజాడ అప్పారావు పుత్తడిబొమ్మ పూర్ణమ్మ రచనతో పాటు కథలు, పాటలు, పద్యాలు, కళారూపాల ద్వారా బాల్య వివాహాలు, బాలికలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి కృషి చేశారని తెలిపారు. తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించారని, ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారని, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ప్రసన్న, సుమతి, లావణ్య, వాణి, నీలిమ, ఝాన్సీ, లావణ్య, సరూప తదితరులు పాల్గొన్నారు.

సంతబయలులో..

పరవాడ సంత బయల వద్ద గురజాడ చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్న మంచి అన్నది పెంచుమన్నా దేశభక్తి గీతాన్ని ఆటో కార్మికులకు పాడి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరికపు హద్దులు బద్దలగొట్టి, రాజభక్తిని, దైవభక్తిని వీడి దేశభక్తి వైపు ప్రజలను నడిపించిన అక్షర యోధుడు గురజాడ అప్పారావు నేటి తరానికి నిత్య మార్గదర్శి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి రాంబాబు, పి పరదేశి నాయుడు, వి రవి, సిహెచ్ రమణమ్మ, ఆర్ సంతోష్, పి అప్పలరాజు, పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం హైస్కూల్లో గురజాడ అప్పారావు చిత్రపటానికి ఐద్వా నాయకులు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన రచించిన పాటలను విద్యార్థులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు రామలక్ష్మి, ఐద్వా మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు సత్యవతి, వనజ, మానస, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట బాలికల హైస్కూల్లో ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వర్ణకుమారి, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శివాజీ, ఉపాధ్యాయులు శకుంతల, కల్పన, అనిత, కాళిదాసు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

యస్.రాయవరం: మహాకవి గురజాడ అప్పారావు గారు వర్ధంతి వేడుకలు జన్మస్థలం ఎస్ రాయవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సెంటర్లో గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఎంపీపీ కోనలక్ష్మి చేతుల మీదుగా అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గొప్ప వ్యక్తి మన రాయవరం గ్రామంలో జన్మించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బైపా శ్రీను, మాజీ సర్పంచ్ నానాజీ, పలువురు వైసిపి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మహాకవి గురజాడ వర్ధంతి సందర్భంగా విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణం టర్నర్ సత్రంలో అరసం ఆధ్వర్యాన సాహితీ సభ నిర్వహించారు. ముందుగా గుజ్జు వెంకటరెడ్డి రచించిన సంస్కృతి-సంస్కారము పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కథా రచయిత ఎస్.హనుమంతరావు, డాక్టర్ క్షేత్రపాల్, ఆచార్య డివి.సూర్యారావు, వెలమల సిమ్మన్న, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, పి.శ్యామసుందర్, పివి.రాజు, కవులు, రచయితలు పాల్గొన్నారు.



కశింకోటలో పూలమాల వేస్తున్న ఐద్వా, సిఐటియు డివైఎఫ్ఐ నేతలు



పోటీలకు వెళ్తున్న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

నేషనల్ రైఫిల్ షూటింగ్ పోటీలకు 'సంస్కృతి' విద్యార్థులు

ప్రజాశక్తి - పరవాడ

నేషనల్ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన భోపాల్లో ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్న 66వ జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు ఎస్.సుందర్ రామిరెడ్డి, ఎస్.సురేంద్ర పాల్గొంటున్నట్లు స్కూల్ స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధు బాబు తెలిపారు. ఆగష్టు నెలలో జరిగిన సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలలో వీరిద్దరూ స్వర్ణ, కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ సుందర్, సురేంద్రలు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు, కోచ్ ఎస్.రామ్మోహన్‌రావుకు సీఈఓ కె.నిశాంత్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మనీష్, బషీర్, రాజేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంధులకు ఉపయోగపడే యంత్రం రూపకల్పన

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాల విద్యార్థులు కళ్లు లేనివారికి ప్రమాదాన్ని గుర్తించే పరికరం రూపొందించారు. డైట్ కళాశాల 2వ సంవత్సరం చదువుతున్న ఈ.సి.ఈ విద్యార్థులు ఎస్.మహేష్, ఎం.మేఘన, జి.ఝాన్సీ రూపొందించిన ఈ పరికరం అంధులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రొజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు తెలిపారు. అంధులు ఒంటరిగా వెళ్లే టప్పుడు ఏదైనా అడ్డువచ్చినపుడు ఈ పరికరం సౌండ్‌తో ఎలర్ట్ చేస్తుందని, ఈ ప్రొజెక్ట్ చెయ్యడానికి 300 రూపాయలు ఖర్చు చేసినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి సెన్సార్, స్టిక్, బజర్, ఎల్.ఈ.డి బల్బ్, 9ఓల్ట్ పవర్ సప్లయ్, ఆన్ ఆఫ్ స్విచ్ వాడినట్లు విద్యార్థులు చెప్పారు. ఈ ప్రొజెక్ట్ గైడ్‌గా ప్రొఫెసర్ రమణబాబు వ్యవహరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, డీన్ అకాడమిక్ కె.పార్వతి, విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ విద్యార్థులను అభినందించారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి


ప్రజాశక్తి-దేవరాపల్లి : డిసెంబర్ 2 నుండి 5వ తేదీ వరకు తుపాను ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో వరి పంట వేసిన రైతులు బాధ్యతగా, అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వై.కాంతమ్మ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కోతలు కోసిన వరి పంటను ఈనెల 1న శుక్రవారం కుప్పలుగా వేసుకోవాలని కోరారు. వర్షం పడిడే పొలంలో నీరు నిల్వ ఉండకుండా నీరు పొలం బయటకు వెళ్లి పోయేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. లేకుంటే వర్షాలకు తడిసి రైతులు నష్టపోతారని పేర్కొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా మార్టూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరాలని ఈ సందర్భంగా విద్యార్థులకు హితవు పలికారు. ఆయన వెంట పార్టీ నాయకులు కరణం శ్రీనివాసరావు, బొడ్డపాటి రాజారావు తదితరులున్నారు.

భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం కోటవీధి శ్రీభోగలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహాన్యాసక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేరూరి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 200 మంది దంపతులు పాల్గొన్నారు. పూజలో కూర్చున్నవారికి చైర్మన్ ఆళ్ల దంపతుల చేతుల మీదుగా మగవారికి కండువాలు, ఆడవారికి జాకెట్టు ముక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏటా కార్తీక మాసంలో స్వామి వారి జన్మనక్షత్రమున ఇలా మహన్యాసక రుద్రాభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కండ్రేగుల రాము, కొణతాల అప్పాజీ త్రినాధరావు, సింగంపల్లి రాజేశ్వరి నాగరాజు, మెళిపాక దుర్గ ఈశ్వరరావులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న జంటలు

అభివృద్ధి పథంలో నరసయ్యపేట

- అన్ని సౌకర్యాలతో సుందరంగా శ్మశాన వాటిక
- చెరువు అభివృద్ధి, రోడ్లు నిర్మాణం
- రూ.అరకోటికి పైగా సొంత నిధులు వెచ్చించిన సర్పంచ్

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని నరసయ్యపేట గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. చోడవరం పట్టణానికి కిలోమీటర్ దూరంలో, చోడవరం-వడ్డాది మెయిన్ రోడ్డుకు అనుకొని ఉన్న నరసయ్యపేట గ్రామం కమర్షియల్‌గా అభివద్ధి చెందుతోంది. స్థానిక సర్పంచ్ ఉగ్గిన గౌరీ శంకరి, తన భర్త నాగబాబు సహకారంతో గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతోపాటు, తమ సొంత నిధులు సుమారు రూ.56 లక్షల వరకు వెచ్చించి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డు నుండి లక్ష్మీపురం లక్ష్మీ గార్డెన్ వరకు మొదట రూ.22 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేశారు. ఇందులో రూ.6 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా, రూ.16 లక్షలు సర్పంచ్ తమ సొంత నిధులు ఖర్చు చేశారు. తరువాత ప్రభుత్వం నుండి రూ.40 లక్షలు మంజూరు కాగా, ఈ గ్రావెల్ రోడ్డులోనే కొంత భాగం ఇప్పటికే సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. అలాగే శ్మశానవాటికలో ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి సకల సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయగా, మరో రూ.30 లక్షలు తమ సొంత నిధులు వెచ్చించి మొత్తం రూ.40 లక్షలతో శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు ప్లాట్‌ఫార్మ్ నిర్మాణం, స్నానాలు చేసుకునేందుకు వాటర్ ట్యాంకు, వాటి ద్వారా పది పైపులు, ప్రాంగణంలో సిసి రోడ్డు, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. రూ.50 లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో గ్రామంలో 19 సిసి రోడ్ల నిర్మాణం చేశారు. లక్ష్మీపురం వెళ్లే దారిలో ఉన్న పాసబంద చెరువు ఆక్రమణలు తొలగించి, సర్పంచ్ తమ సొంత నిధులు రూ.15 లక్షలతో గట్టు ఏర్పాటు చేసి, దాని గుండా కొబ్బరి మొక్కలు నాటారు.



శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన సింహద్వారం

మా ఆదాయంలో కొంత భాగంగా గ్రామాభివృద్ధికి ఖర్చు



సర్పంచ్ గౌరీ శంకరి

నరసయ్యపేట సర్పంచ్ ఉగ్గిన గౌరీ శంకరి, ఆమె భర్త నాగబాబు మాట్లాడుతూ ప్రజాశక్తితో మాట్లాడుతూ గ్రామానికి సేవ చేసుకునే అవకాశం దక్కినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రజలు తమపై ఎంతో నమ్మకముంచి బాధ్యతలు అప్పగించారని, వాటిని నెరవేర్చడంలో శక్తివంతం లేకుండా పనిచేస్తామని చెప్పారు. ప్రభుత్వ నిధులు కోసం చూడకుండా మా ఆదాయాన్ని కొంతమేరకు గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని, ఇది మాకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ సహాయ సహకారాలతో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.



లక్ష్మీ గార్డెన్ వైపు వేసిన సిమెంట్ రోడ్డు



అభివృద్ధి చేసిన చెరువు, గట్టుపై కొబ్బరి మొక్కలు

5న సామాజిక సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : చోడవరంలో సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ, ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్నామని, దానిని విజయవంతం చేయాలని చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నప్పన్నపాలెం వద్ద గురువారం బుచ్చయ్యపేట మండల వైసీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, నాయకులు కొల్లిమల్ల ఆచ్చంనాయుడు, దాకారపు నాగరాజు, కోరుకొండ అప్పలనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం పంచాయతీలో జెండర్ మాసోత్సవాల్లో భాగంగా లింగ వివక్షపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు లింగవివక్ష, ఇతర సామాజిక సమస్యలపైనా, మహిళా విద్య, బాల్య వివాహాల నిరోధించడం, మహిళల ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 18సంవత్సరాలు నిండిన తర్వాత మహిళలకు వివాహం చేయలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శ్రీనివాసరావు, సీసీ రామకృష్ణ, పద్మావతి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. జెండర్ మాసోత్సవాల్లో భాగంగా మహిళలు గురువారం లింగ వివక్ష, ఆడ పిల్లల రక్షిద్దాం వంటి నినాదాలతో రంగులు వేశారు.

లక్కవరంలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-చోడవరం : కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని చోడవరం సీఐ బి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లక్కవరం గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని కులాల మతాలవారు కలిసిమెలిసి జీవించడం భిన్నత్వంలో ఏకత్వమన్నారు. ఎవరు సాంప్రదాయాలు మతాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించుకునేటప్పుడు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంకేమాధికారి బి ఈశ్వరరావు, రెవెన్యూ అధికారి గిరి, స్థానిక సర్పంచ్ రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు బెడ్‌షీట్లు, కంచాలు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మాజీ మంత్రి, విశాఖ ఉత్తరం నియోజకవర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలలో భాగంగా గురువారం రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు చేతుల మీదగా కసింకోట మండలం తేగాడ ఎంపి మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో విద్యార్థులకు బెడ్ సీట్లు, కంచాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కలగా సోమేశ్వరరావు, కడింశెట్టి నరసింహారావు, సిదిరెడ్డి సూర్యనారాయణ, కర్రి దుర్గ నాయుడు, మాజీ సర్పంచ్‌లు జెరిపోతులు నూకునాయుడు, బుదిరెడ్డి గంగయ్య, చిదిరెడ్డి శ్రీను, తిర్రి చిరంజీవి. మజ్జి నిరంజన్ కుమర్, నారిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామం, గవరపేటలో ఉన్న శ్రీసంతోష్ మాత ఆలయం నుంచి ఏటుకూరి అప్పలరాజు భూముల నుండి జుత్తాడ వెళ్లి రోడ్డు వరకు రోడ్డు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు చౌడువాడ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీ నిధుల నుంచి రూ.50 లక్షలతో ఈ రోడ్డు మంజూరు చేశారు. 560 మీటర్ల సిమెంట్ రోడ్డు, 380 మీటర్లు కాలువను ఏర్పాటు చేశారు. ఈ పనులను గ్రామానికి చెందిన వారధి అప్పారావు తక్కువ సమయంలో సంతృప్తికరమైన చేయించారు. దీంతో చౌడువాడ గ్రామ ప్రజలు తక్కువ దూరంతో కల్లాలకు జుత్తాడ మీదుగా చోడవరం వెళ్ళుటకు సులువుగా ఉంటుందని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను వైయస్సార్సీపి మండల నాయకులు దాట్ల శివాజీ రాజు, గ్రామ సర్పంచ్ దాడి ఏరుకు నాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, మండల ఇంజనీరింగ్ అధికారి బాలాజీ అప్పారావు గురువారం పరిశీలించారు.




రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

మృతుని కుటుంబానికి రూ.10.25 లక్షల పరిహారం

ఆందోళనతో దిగొచ్చిన 'అభిజిత్' యాజమాన్యం

ప్రజాశక్తి-అచ్చుతాపురం

అభిజిత్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ అకాలంగా గుండెపోటుతో మృతి చెందిన సుందరపు సత్యారావు కుటుంబానికి 10 లక్షల 25 వేల రూపాయలు పరిహారం చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించింది. అభిజిత్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న మడుతురు గ్రామానికి చెందిన సత్యారావు విధి నిర్వహణలో ఉండగా అనారోగ్య పరిస్థితి ఏర్పడడంతో బుధవారం మృతి చెందిన విషయం విధితమే. మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వాలని కుటుంబీకులు యాజమాన్యాన్ని అడిగిన స్పందించకపోవడంతో సిఐటియు, జనసేన ఆధ్వర్యాన బుధవారం రాత్రంతా సత్యారావు మృతదేహంతో పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు యాజమాన్యం స్పందించి నాయకులతో చర్చించి మృతుడి కుటుంబానికి 10 లక్షల 25 వేల రూపాయలు పరిహారం చెల్లించడానికి ఒప్పందం చేసింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము వైయస్సార్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు, జనసేన పార్టీ వీర మహిళ ఎం త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న స్థానిక మహిళలు, నాయకులు



సమావేశంలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ అధికారి రాహుల్ మాలిక్, కలెక్టర్ తదితరులు

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల పూర్తి అవగాహన కల్పించేందుకు వికాసిత్ భారత్ యాత్ర నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అధికారి రాహుల్ మాలిక్ తెలిపారు. వికాసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహణ తీరుతెన్నులపై గురువారం జిల్లా కలెక్టర్ రవి పట్టం శెట్టితో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికై కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. విద్యా, వైద్యం, తాగునీరు, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు, ఉపాధి, వ్యవసాయం, అనుబంధ శాఖల అభ్యున్నతి మొదలైన రంగాలలో పేదలకు అండగా అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కొనసాగుతున్న పథకాలపై ప్రజలందరికీ క్షుణ్ణమైన అవగాహన తీసుకురావాలని కోరారు. జిల్లా కలెక్టర్ రవి పట్టంశెట్టి జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ, డిఆర్ఓ బి.దయానిధి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ రాజ్, కెఆర్‌సిసి ఎస్‌డిసి ఏ.మహేష్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజుల వాణి, డిఎంహెచ్వో డాక్టర్ ఏ.హేమంత్, సిపిఓ జి.రామారావు, వ్యవసాయ శాఖ జెడి మోహన్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట కూడలిలో తరచూ ప్రమాదాలు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట నాలుగు రోడ్ల కూడలిలో కొద్ది రోజులుగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కసింకోట- బంగారుమెట్ట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో ఈ రోడ్డులో కూడా అనకాపల్లి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు సంఖ్య పెరిగింది. వాహనాల రద్దీ అధికమైంది. అనకాపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు విశాఖపట్నం వెళ్లే, పాడేరు, మాడుగుల తదితర ప్రాంతాల నుండి వెళ్లే వాహనదారులు సైతం ఈ రోడ్డు గుండానే ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్డు వెడల్పుగా ఉండడంతో వాహనాలు వేగంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. బుచ్చయ్యపేట కూడలిలో పోలేపల్లి నుండి బుచ్చయ్యపేట గ్రామం నుండి వచ్చే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వచ్చిన ప్రమాదాలు జరుగుతున్నాయి. కొద్దిరోజులుగా పదుల సంఖ్యలో వాహనాలు పరస్పరం ఢీకొనడంతో పలువురుకు గాయాలయ్యాయి. గురువారం ఉదయం పోలేపల్లి నుండి వస్తున్న బైకును వడ్డాది వైపు నుండి వస్తున్న బైక్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీంతో కూడలిలో ఉన్న ప్రయాణికులు వెళ్లి వారిని లేపారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు వేగాన్ని నిరోధించే విధంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు రత్నాకర్ వినతి

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి మండలం పాపయ్య సంతపాలెంలో గ్రామంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ గురువారం ఎపిఇపిడిసిఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ పాపయ్యసంతపాలెంలో సుమారు 70 నుంచి 80 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, కొంతకాలంగా లోఓల్టేజ్ సమస్య ఉండడంతో మోటార్లు కాలిపోతున్నాయని చెప్పారు. ఇళ్లవద్ద వాడే వివిధ రకాల విద్యుత్ పరికరాలు కూడా లోవోల్టేజి కారణంగా కాలిపోతున్నాయని తెలిపారు. గ్రామంలోని విద్యుత్ కనెక్షన్లకు సరిపడా విద్యుత్ సరఫరాకు తగిన ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడమే దీనికి కారణమని, వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు వేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ వైన్‌మెన్, హెల్పరు లేకపోవడంతో వర్షాలు, పిడుగులు ఇతర విపత్తులు సంభవించినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన సమయంలో దానిని సరిచేసేందుకు గంటలు, రోజులు సమయం పడుతుందని, శాశ్వత ప్రాతిపదికన లైన్‌మెన్, హెల్పరును నియమించాలని రత్నాకర్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇఇ రామకృష్ణ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-చోడవరం : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పలు శాఖల సమన్వయంతో పనిచేస్తున్నామని చోడవరం కార్మిక శాఖ అధికారి పి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు ఇటుకు బట్టీలను ఐసిడిఎస్ పిఓ ఉషారాణి, ఎస్ఐ సూర్యనారాయణతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార దుకాణాల్లోనూ, చిన్న పరిశ్రమలు, ఇటుకు బట్టీలు తదితర వాటిలో 14 సంవత్సరాల లోపు పిల్లలచే పని చేయించడం నేరమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక సీఐ బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిబి నివారణ మందులు అందించిన లుపిన్

ప్రజాశక్తి - పరవాడ : జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం లుపిన్ హూమన్ వెల్ఫేర్, రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన క్షయ వ్యాధి నివారణ మందులను వితరణ చేసింది. ఈ మేరకు ఫ్యాక్టరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సురేష్ బాబు, సిఎస్‌ఆర్ మేనేజర్ డి వెంకట నారాయణ, లుపిన్ ఫౌండేషన్ డాక్టర్ పి.జగదీశ్వర్‌రావు తదితరులు విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో గురువారం జిల్లా, క్షయ వ్యాధి ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ సిహెచ్.పూర్ణేంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ క్షయ వ్యాధి బాధిత రోగులకు ఒక లక్ష టాబ్లెట్స్ అందచేయడానికి ముందుకు వచ్చిన లుపిన్ ఫార్మా కంపెనీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ టాబ్లెట్స్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న సుమారు 300 మంది క్షయ వ్యాధి బాధితులకు 3 నెలలు పాటు అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి సత్య నారాయణ, జిల్లా డిపిఎస్ హెచ్‌ఐవి బి.లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల ఇళ్లకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : శిధిలావస్థలో ఉన్న పట్టణంలోని ఏఎంసి కాలనీని గురువారం ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీ 83వ వార్డు ఏఎంసి కాలనీ గృహ సముదాయాన్ని 17 సంవత్సరాల కిందట నిర్మించి ఇచ్చారని, వాటికి నేటి వరకు ఇంటి పన్నులు వేయలేదనని తెలిపారు. నేడు అవి శిథిలాస్థకు చేరాయని, ఇల్లులు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి రాజకీయ నాయకులు వస్తున్నారు తప్ప తమ కష్టాలు పట్టించుకోలేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి శిథిల ఇళ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొడ్డు సోమరాజ్, బుగిడి నూకప్పారావు, ముగడ అప్పారావు, పల్లా సత్య అప్పారావు, శ్రీకాకుళం గణపతి పాల్గొన్నారు.

జోరుగా ఎంవిఆర్ ఉచిత తీర్థ యాత్రలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం నరసింగరావుపేట ఎంవీఆర్ కార్యాలయం నుంచి మునగపాక మండలం తిమ్మరాజుపేట, తోటాడ, సిరసపల్లి గ్రామాలకు చెందిన భక్తులతో ట్రస్ట్ వాహనం బయలుదేరింది. ఈ సందర్భంగా ముత్యాల వెంకటేశ్వరరావుకు శాలువా కప్పి భక్తులు సత్కరించారు. అనంతరం ఎంవిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి మున్నగు ఆలయాల దర్శనములకు భక్తులను సకల సౌకర్యాలతో ఉచితంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో సమస్యలపై గళం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం సజావుగా సాగింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు తెలుగుదేశం, జనసేన కౌన్సిలర్లు మున్సిపాలిటీలో పారిశుధ్యం తిష్టవేసిందని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ధనమిరెడ్డి మధు ప్రశ్నలు వేయడంతో అధికారులు నీళ్లు నమిలారు. దీనికి అధికార వైసిపి కౌన్సిలర్లు తమరాన నాయుడు మాట్లాడుతూ, నర్సీపట్నం అభివృద్ధి పథంలో నడుస్తుందని, దీనిపై ప్రజలని అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు. దీంతో, పద్మావతి ప్రశ్నిస్తూ పారిశుధ్యం మెరుగుపరచాలని ఎన్నిసార్లు తెలియజేసినప్పటికీ అధికారుల పనితీరులో మార్పు రాలేదని ఆమె అన్నారు. కౌన్సిలర్ రామరాజు తమ వార్డుకు రోడ్డు సదుపాయాన్ని కల్పించకపోవడం దారుణమని, తమ వార్డులో సమస్యలపై బ్యానర్ ప్రదర్శిస్తూ కౌన్సిల్ సమావేశం నిరసన తెలిపారు. కౌన్సిల్ సమావేశాల్లో తమ గ్రామ సమస్యలపై లేవ నె త్తు తూ నే ఉన్నానని,వాటి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి రోడ్డు, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు.



సమస్యలను లేవనెత్తుతున్న పద్మావతి, (ఇన్‌సెట్‌లో చైర్ పర్సన్)



బ్యాంకు వద్ద మాట్లాడుతున్న ఎస్ఐ

పింఛను సొమ్ము తరలింపులో

సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: బ్యాంకుల నుండి పింఛన్ సొమ్ము విత్ డ్రా చేసి తీసుకువెళ్లే సమయంలో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ ఐ విభూషణరావు సూచించారు. మండలంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు, ఇతరులకు ఒకటవ తేదీ శుక్రవారం పెన్షన్లు సొమ్ము పంపిణీ చేయడానికి గాను గురువారం సచివాలయ సిబ్బంది బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసారు. ఈ మేరకు నక్కపల్లి ఐఓబి వద్ద గురువారం ఎస్సై విభూషణరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్సై అవగాహన కల్పించారు. నగదు తీసుకెళ్లేటప్పుడు మొబైల్‌లో మాట్లాడటం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటివి చేయకూడదని సచివాల సిబ్బందికి సూచించారు. అపరిచిత వ్యక్తుల సంచరించినట్టు అనుమానాలుంటే వెంటనే గుర్తించి సమాచారం ఇవ్వాలన్నారు.



పూజలు చేస్తున్న గ్రామస్తులు

మొక్కలు నాటాలి

ప్రజాశక్తి కోటవురట్ల: నీలుగుంట గ్రామంలో పరదేశమ్మ ఆలయం వద్ద పురాతనంగా ఉన్న వేపచెట్టు అకారణంగా నేల కొరగింది. దీనిని తొలగించి గ్రామస్తులంతా ఏకమై ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కను నాటారు. స్థానిక సర్పంచ్ వరహాల బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వరహాల బాబు మాట్లాడుతూ, మొక్కలు మానవాళికి ప్రాణవాయువును అందిస్తాయని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తిబాబు, వైసిపి యువ నాయకులు సాయిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి

ప్రజాశక్తి -కోటవురట్ల: విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని మానసిక వైద్య నిపుణులు బంగారయ్య కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.

టిడిపి పథకాలపై ప్రచారం



నక్కపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రచారం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు గింజాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం బూత్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పథకాలకు సంబంధించిన కర పరత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిక్కి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని బిసి సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర అన్నారు. జివిఎంసి 81వ డివిజన్ గవరపాలెం గంగిరేణు చెట్టు, ఎల్లపు వారి వీధి, నిదానం దొడ్డి, ప్రాంతాలలో సురేంద్ర ఆధ్వర్యంలో మినీ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్లపు జగన్నాధరావు, కాండ్రేగుల చిన్న, పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : తూర్పు నియోజకవర్గ పరిధి చినవాల్తేరు రజక వీధి అప్పలమ్మ గుడి వద్ద 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. 20వ వార్డు టిడిపి అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యాన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో అవినాష్, మూర్తియాదవ్, మురళి పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి- రావికమతం: జాతీయ కబడ్డీ జట్టుకు మరుపాక మోడల్ పాఠశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పసుపులేటి అరుణకుమార్ ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ సత్య సునీల్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 బాలుర విభాగంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన అరుణ కుమార్ చిత్తూరు జిల్లా చౌడుపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబాడీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని ఆయన తెలిపారు. ఈ మేరకు ట్రోఫీతో పాటు ఫీల్డ్ అందుకున్నారు. 2024 జనవరి 7 నుంచి 11 తేదీలలో తెలంగాణ రాష్ట్రం కామారెడ్డిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ సునీల్ తెలిపారు. జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన అరుణ కుమార్ ను పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందితోపాటు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోవిందు, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.



ట్రోఫీతో అరుణకుమార్



సన్మానిస్తున్న నేతలు

టిడిపి పరిశీలకునిగా వెంకట నరసింగరావు

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల నియోజకవర్గ టిడిపి పరిశీలకుడుగా నూతనంగా నియమితుడైన కరోతు వెంకట నరసింగరావును పలువురు నేతలు అభినందించారు. మాడుగుల తెలుగుదేశం కార్యాలయంలో గురువారం పరిచయ కార్యక్రమం నిర్వహించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట నరసింగరావు మాట్లాడుతూ తెలుగుదేశం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు బలంగా పని చేయాలని ఆయన సూచించారు. మాజీ శాసనసభ్యుడు గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ, రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంను ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇంచార్జ్ పివి జి కుమార్, తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాద్ సోదరుడు పైలా నాయుడు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి - మాడుగుల : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇక్కట్లు పడుతున్నట్లు కౌలు రైతు తెలిపారు. మాడుగులకు చెందిన షేక్ దేవుడమ్మ తన వ్యవసాయ మోటార్ కనెక్షన్ మరమ్మత్తులు చేయాలని విద్యుత్ సిబ్బందికి తెలియపరచిన నెల రోజులుగా ఎటువంటి స్పందన లేదని వాపోయింది. మాడుగుల గ్రామానికి చెందిన 494 సర్వీస్ నెంబర్ వ్యవసాయం మోటార్ కనెక్షన్‌పై జామ తోట సాగు చేస్తున్నామని, ఇటీవల ప్రక్క పొలంలో చెట్లు తొలగింపులో విద్యుత్ కనెక్షన్ వైర్లు తెగిపడ్డాయని తెలిపింది. విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని, సరఫరా లేక జామ తోట ఎండిపోతుందన్నారు.

వైఎస్ఆర్ బీమా నగదు అందజేత

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కుసర్లపూడి గ్రామంలో సియ్యద్రి సత్తిబాబు మృతి చెందాడు. దీంతో, ఆయన దహన సంస్కరాల నిమిత్తం రూ.10వేల వైయస్సార్ భీమా తక్షణ సాయాన్ని సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి కొల్లు సన్యాసి నాయుడులు సత్తి బాబు భార్య సత్యవతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గొల్లు రాజుబాబు, పార్టీ సీనియర్ నాయకులు సబ్బవరపు పెద్దినాయుడు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న చైర్మన్, నేతలు

పేదల అభ్యున్నతికి పథకాలు



చీడికాడలో హాజరైన నేతలు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ, పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నా రన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, జడ్పీటీసీ లాలం శారదా వరలక్ష్మి జానకిరాం, మండల సచివాలయ కన్వీనర్ ఈర్లి చైతన్య, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు నందారపు రమణ బాబు, మండల యువజన అధ్యక్షులు గొల్లవిల్లి స్వామి నాయుడు, సర్పంచ్ మట్ట అప్పారావు, ఉప సర్పంచ్ పిటి బాబు, విశాఖ డైరీ డైరెక్టర్ సీరంరెడ్డి సూర్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు చొక్కాకుల వెంకీ నాయుడు, బలిజ నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: మండలంలోని కేపీ అగ్రహారం సచివాలయంలో గురువారం వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు, మండల నాయకులు దాకారపు నాగరాజు, డి.నారాయణమూర్తి, సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ డి.ముసిలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : సిఎం జగన్ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎంపిపి గజ్జలపు మణికుమారి కొనియాడారు. మండలంలోని రావణాపల్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, చోద్యం కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, సత్యనారాయణ, కొమిర సర్పంచ్ రాజు, పుత్తడి గైరంపేట సర్పంచ్ పత్తి రమణ, జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు అప్పికొండ వీధి వార్డు సచివాలయం పరిధిలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సచివాలయం కన్వీనర్ ఆర్ దేవి, వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు, కదిరి ఎల్లాజీ, మైలపల్లి లక్ష్మణరావు తది తరులు పాల్గొన్నారు

సీతమ్మధార: జివిఎంసి 26వ వార్డు ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో బోరావారి వీధిలోనూ, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి ఆధ్వర్యంలో జై భారత్ నగర్‌లో ఎపికి జగనే ఎందుకు కావాలంటే. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొనిప్రభుత్వ సంక్షేమ, అభివద్ధి పనులు వివరాల బోర్డును, .అనంతరం పార్టీజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, ఎపిడి దుర్గాప్రసాద్, డైరెక్టర్లు పాండవ శ్రీను, జెసిఎస్ మండల కన్వీనరు బులుసు జగదీశ్, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేటి కిరణ్. కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని పార్టీజెండా అవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు.మద్ది గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, వైసిపి మండల అధ్యక్షుడు కె లక్ష్మణరావు, మద్ది సర్పంచ్ బి సన్యాసమ్మ. పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని తానాం పంచాయతీ సచివాలయం-1లో జెడ్పీటీసీ పిఎస్.రాజు ఆధ్వర్యంలో గురువారం ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావుతో కలిసి సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ అమర్చిన డిసిప్లే బోర్డును ఆవిష్కరించారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పనలో సత్తా

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థులు ప్రధమస్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయినట్లు మండల విద్యాశాఖాధికారి కె.నరేష్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణీలలిత తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయురాలు జి.సుమబిందు పర్యవేక్షణలో విద్యార్థులు జయవర్ధన్, జయదుర్గ, నానాజీలు అరటిదువ్వ పొడిని ఉపయోగించి భూసారాన్ని పెంచడం పై ప్రాజెక్టును రూపొందించారన్నారు. అరటి దువ్వ వ్యవసాయ వ్యర్థంగా కాకుండా వనరుగా ఉపయోగించు కోవచ్చునని ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు విజయవాడలో నవంబర్ 29, 30 తేదీల్లో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ -2023 కార్యక్రమంలో ఈ ప్రోజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన చేసిన విద్యార్థులు పతకం, సర్టిఫికెట్‌లు సాధించారన్నారు. త్వరలో జాతీయ స్థాయి పోటీలలో కూడా నక్కపల్లి సత్తా చాటాలని ఆకాంక్షించారు.

కనుజు మాంసం విక్రయంపై కేసు నమోదు

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలోని ఎరకన్న పాలెం గ్రామం వద్ద కనుజు మాంసం అమ్ముతూ పట్టుబడ్డ వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రశాంతి కుమారి తెలిపారు. వివరాల్లోకి వెళితే... చినరాచపల్లి గ్రామానికి చెందిన చింతల సత్తిబాబు, పూడిరమణలు తడకనపాలెం సమీపంలో ఎర్రకన్నపాలెం సమీపంలో 11 కిలోల కనుజు మాసం విక్రయిస్తున్నారు. తమ సిబ్బంది సహాయంతో ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె అన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ఉపేంద్ర

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కేడీపేట ఎస్సై ఉపేంద్ర సూచించారు. గురువారం గొలుగొండ మండలం కేడీపేట హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలకు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు బాలికలు బాల్య వివాహాలు చేసుకోవడం నేరమని, ఈ విషయమై పోలీసులకు విద్యార్థులు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నూకరాజు, ప్రిన్సిపాల్ గంగరాజు పాల్గొన్నారు.

విఆర్‌పి తొలగింపు

ప్రజాశక్తి-రోలుగుంట: నిండుగొండ వీఆర్పీ చుక్కా శివను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా జల యజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్ ఉత్తర్వులు జారీ చేశారు. శివ వీఆర్పీగా పని చేసిన సమయంలో జీడిపిక్కల కర్మాగారంలో కార్మికులు పలువురు పనులకు హాజరయ్యారని చూపించి నిధుల స్వాహాకు పాల్పడినట్లు సర్పంచ్ శెట్టి సంధ్య నాలుగేళ్ల క్రితం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.

అధునాతనంగా పార్కుల అభివృద్ధి

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలోని పార్కులను అభివృద్ధి పచిచి అధునాతనంగా, సుందరంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. జోన్-3లోని శివాజీ పార్క్, ఎంవిపి సెక్టార్ 11లో బృందావన్ పార్కుల అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివాజీ పార్కులో వాకింగ్ ట్రాక్‌ను, వాటర్ ఫౌంటెన్, జిమ్, యోగా ప్రదేశాలను, చిల్డ్రన్ ప్లే ఏరియా, టాయిలెట్స్ ఇతర మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పార్కును పరిశుభ్ర పరిచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాంటీన్ మరమత్తులు పనులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలనిన్నారు. పార్కు వెలుపల ఖాళీ స్థలాన్ని పరిశీలించి సందర్శకులు వాహనాలను పార్కు చేసుకునేలా ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కులోని అన్ని పనులు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణ రాజును ఆదేశించారు. అనంతరం ఎంవిపి కాలనీ సెక్టర్ 11లో సుందరంగా తీర్చిదిద్దిన బృందావనం పార్కును పరిశీలించారు. గోడలకు పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని, ఎక్కువగా నీడనిచ్చే మొక్కలను వేయాలని పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణ రాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రత్నాకర్‌రెడ్డి, ఎఎంహెచ్ఒ సిహెచ్.సత్యనారాయణ, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు తీర్చేందుకే ఆవిర్భావం

-కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాంబాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : చిన్న, మధ్య తరహా ప్రజల అవసరాలకు తీర్చేందుకే తమ బ్యాంకు ఆవిర్భవించిందని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. ఖాతాదారుల ఆదరణతో 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడిందని పేర్కొన్నారు. రానున్న కాలంలో బ్యాంకును మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా రాజమండ్రి బ్యాంకు శాఖ ఆవరణలో గురువారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం 7 మంది సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17300 మంది సభ్యులతో రూ.31 కోట్లు వాటా ధనం పొంది అర్బన్ కోఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలని, రుణ ఖాతాదారులకు పాస్ బుక్‌లను ఏర్పాటు చేయాలని, రుణాలపై వడ్డీ రేటును తగ్గించాలని కోరారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకుంటామని చైర్మన్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ ఖాతాదారులకు బ్యాంకు చైర్మన్ సత్కరించి, మెమోంటాలను అందజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు సిపి.రామారావు, బి.పుల్లయ్య, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యాంకిషోర్, రీజనల్ మేనేజరు సింహాచలం, శాఖ మేనేజరు ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు ప్రతినిధులు

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అన్నారు. సిరిపురంలోని వివిఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో సెక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై జిల్లా రెవెన్యూ అధికారి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సెక్టార్ అధికారులు సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌నూ సందర్శించాలని, పోలింగ్ స్టేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియపై, పోలింగ్‌కు ముందు, పోలింగ్ సందర్భంలో, పోలింగ్ తర్వాత చేయాల్సిన విధుల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సెక్టోరల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి



కోటవురట్లలో అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి- కోటవురట్ల: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసిల్దారు జానకమ్మ సూచించారు. గురువారం మండలంలో కొడవటిపూడి గ్రామంలో స్థానిక సర్పంచ్ కోసూరి అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు సూర్యప్రకాష్ సమక్షంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పౌరులు అందరికీ సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌరులకు అందాల్సిన పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఓ రాజ్యలక్ష్మి, ఆర్ఐ వృద్ధవరావు గ్రామ రెవెన్యూ అధికారి సుధా, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని తాళ్లచీడికాడ గ్రామంలో సర్పంచ్ భీమిరెడ్డి పేరయ్య అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డేవిడ్ రాజు మాట్లాడుతూ, పౌర హక్కులపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామస్థులకు పౌరహక్కులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబర్ చిట్ల చలపతిరావు, ఆర్ఐ ఎ.నాగరాజు, ఏఎస్సై రామరావు పాల్గొన్నారు.



గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



అంగన్‌వాడీ కేంద్రం

ప్రారంభానికి నోచని అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో 3వ అంగన్వాడీ కేంద్రం పోలీస్ స్టేషన్ పక్కన నిర్మాణం చేపట్టారు. ఏడాది కావస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రధానంగా బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారుడు భవనానికి తాళాలు వేశారు. ప్రస్తుతం మూడవ నెంబరు అంగన్వాడీ కేంద్రం అద్దె కొంపలో కొనసాగుతుంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి అంగన్వాడి కేంద్రం ప్రారంభించి అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.



ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

వెంకన్న ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని తుర కలపూడి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు దొండా రాంబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దాకారపు నాగరాజు, గ్రామ సర్పంచ్ గోవింద్, చినప్పన పాలెం సర్పంచ్ కోవెల ఈశ్వరరావు, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపి శెట్టి శీను, సమర సేవ పౌండేషన్ కన్వీనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సాయం చేస్తున్న దాత

బాధితురాలికి సహాయం

ప్రజాశక్తి -యస్.రాయవరం: మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన జోగమంగ ఇల్లు ఇటీవల దగ్ధం కావడంతో సర్వశ్వం కోల్పోయింది. మానవతా దృక్పదంతో ముందుకు వచ్చిన పాయకరావుపేటకి చెందిన ఇండియన్ గ్యాస్ యజమాని గారా ప్రసాద్ బాధితురాలికి సహాయం అందించినట్టు సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. గురువారం ఉదయం ఇండియన్ గ్యాస్ యాజమానులు గారా ప్రసాదు, జోగ మంగ కుటుంబానికి గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యులేటర్ అందించారు.

తీరంలో కొనసాగుతున్న నేవీ విన్యాసాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేవీ డే వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆర్‌కె.బీచ్ వద్ద నావికాదళ విన్యాసాలను నేవీ సిబ్బంది కొనసాగించారు. తూర్పు నావికాదళానికి చెందిన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు యుద్ధనౌకలు, సబ్ మెరైన్లు విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఈ విన్యాసాలు బీచ్ రోడ్డులోని సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ నెల 4వ తేదీ నేవీ డే సందర్భంగా ఫైనల్ విన్యాసాలు నిర్వహించనున్నామని నేవీ అధికారులు తెలిపారు.